# పరాయివాడి పరుపు

వాళ్ళిద్దరూ మంచంమీద పడుకుని వున్నారు - నగ్నంగా, అసంతృప్తిగా.

సింతియా రొమ్ములమీదున్న వినోద్ చెయ్యి రొమ్ములతోపాటు మెల్లగా పైకీ, కిందికీ కదులుతోంది. ఇంకో చెయ్యి మండిపోతున్న అతని కళ్ళ మీదవుంది.

ఏదో యిన్‌స్పెక్షన్ కోసమా అన్నట్టు పరుపుమీద తిన్నగా వుంది వినోద్ శరీరం.

సింతియా కాలిమీద కాలు వేసుకుని వుంది. ఆమె అందమైన ముంగురొకటి వినోద్ చెవికి ఆని వుంది.

ఆమె పెదాలు ఏదో నిశ్శబ్ద చర్చ చేస్తున్నట్లుగా అంటిపెట్టుకుని వున్నాయి. ఆమె దృష్టి యింటి కప్పుమీద వుంది.

వినోద్ వీపుకింద పొడుగ్గా పరుపుమడత.

సింతియా మెడకింద చల్లగా తగులుతూ వినోద్ వాచ్.

వాచీ సన్నటి మోత ఆమె చెవుల్లో.

ఆదరా బాదరా లాగిన బెడ్‌షీట్ కుప్పగా వాళ్ళ కాళ్ళకింద పడివుంది. దాన్ని వినోద్ పరుపుమీద నుంచి కిందకి తోసేయాలనుకున్నాడు - సీ, తోస్తే చప్పుడవుతుందనీ, అదీ కాక సింతియా నిశ్శబ్దంగా వుందనీ జంకాడు.

సింతియా తన రొమ్ములమీద వున్న వినోద్ చేతిని తీసేసి పరుపుమీద యింకెక్కడైనా వుంచాలనుకుంది కాని - తలకిందవున్న తన చేతుల్ని తీయడం యిష్టంలేక అలాగే వూరుకుంది.

సింతియా దేని గురించి ఆలోచిస్తోంది- అనుకున్నాడు వినోద్.

సింతియా దేని గురించీ ఆలోచించడం లేదు. నగ్నంగా, అసంతృప్తిగా అట్లా పడుకుని వుంది.

ఆమె మెత్తటి మోచేయిచివర వినోద్ నోటి మీద వుంది. ఆ మోచేయి బరువు యిష్టంలేక వినోద్ మెల్లగా తల కదిపాడు. సింతియా మోచెయ్యి అతని నోటిమీద నుంచి మెడకిందికి జారింది.

గదిలో ఎక్కువ అవుతోన్న చీకటీ, వేడీ.

"వినోద్! నిద్రపోయావా నువ్వు?" - పొడిగా సింతియా మాట.

నిద్రపోతున్నాననే అనాలనుకున్నాడు వినోద్. తను అంతసేపు మాట్లాడకుండావున్న దానికి అది మంచిసాకే అవుతుందనుకున్నాడు. కానీ, "ఊహుఁ! మేల్కొనేవున్నా" అన్నాడు మెల్లగా.

ఆ మాటకి యిద్దరూ పొడిగా నవ్వారు కొంచెంసేపు.

"ఇక మనం పక్కమీంచిలేస్తే మంచిదనుకుంటా." జీవం లేని స్వరంతో ఇంటిపై కప్పుతో అంది సింతియా.

---

హిందీ మూలం: కృష్ణబలదేవ్ వేద్

అనువాదం: ఇస్మాయిల్

సింథియా రొమ్ములమీద వున్న తన చేతిని తీసి పక్కన పెట్టుకున్నాడు వినోద్.

సింథియా తనలో తనే నవ్వుకుంది.

"ఎందుకట్లా నవ్వుతావ్?" అడిగి, అడగకుండా వుంటే బాగుండేదనుకున్నాడు వినోద్. ఇంక సింథియాను ఏం అడగను అనుకున్నాడు.

"ఏంలేదు" సింథియా నవ్వేసింది.

సింథియాని కావలించుకుంటే బావుంటుందేమో అనుకున్నాడు వినోద్.

సింథియా యింటికప్పుకేసి చూస్తూ, వినోద్ వాచీ సన్నటి శబ్దాన్ని వింటోంది.

సింథియాని మరీ అంత మొండిగా అడగడం తప్పేమో. అసలు నేనిక్కడకు రావడమే తప్పేమో - అనుకున్నాడు వినోద్.

తామిద్దరూ పక్కమీదికి వచ్చే ముందు సింథియా పదేపదే అంది, "వినోద్! ఇక్కడొద్దు. వొద్దు వినోద్!" కాని యిప్పుడు సింథియా ఏ ఆలోచనా లేకుండా ఇక్కడే పరుపుమీద పడుకుని వుంది. తనకి తృప్తిలేకపోవడం గురించికానీ. వినోద్ మరీ పట్టు పట్టడం గురించైనా కానీ ఆమె ఏమీ ఆలోచించడం లేదు. అయినా మధ్య మధ్య కొంచెం సేపు పొడిగా నవ్వుతోంది. ఆ నవ్వుని ఆపుకోలేక పోతోంది.

సింథియా నన్నిట్లా అవమాన పరచాలనుకుంటోంది-అనుకున్నాడు వినోద్.

సింథియా అటువంటిదేం చేయడం లేదు. నవ్వుతోంది. అంతే.

.. ... ......

వాళ్ళిద్దరూ పరుపుమీదికి చేరేముందు వినోద్ సింథియాని మొండిగా, తదేకంగా చూస్తుంటే -

"వినోద్! ఇక్కడొద్దు, వొద్దు వినోద్!" అంటూ సింథియా హఠాత్తుగా బట్టలుతీయడం మొదలెట్టింది. అంతే మరుక్షణంలో ఆమె మంచంమీద వుంది-నగ్నంగా.

అప్పుడు తనకి హఠాత్తుగా కలిగిన నిరాశకి కారణం ఏమిటో వినోద్‌కి అంతుపట్టలేదు. కాని, అతను గబా గబా వెళ్ళి కిటికీ తెరలన్నీ దించేశాడు, బయటినుంచి ఏం కనిపించకుండా. అక్కడక్కడా ఏవో వెలుతురు పొడలు తప్పితే గదంతా మసగ్గా మారింది.

తెరలు దించేసి వెళ్ళి, సింథియా భావరహితంగా తనని చూస్తుంటే పక్కమీద కూచున్నాడు సిగరెట్ కాలుస్తూ.

సింథియాని అతనెప్పుడూ నగ్నంగా - పూర్తిగా నగ్నంగా - చూడలేదు.

"బట్టలు లేకుండావుంటే నన్ను నువ్వు యిష్టపడక పోవచ్చు." అని సింథియా ఒకసారి అన్నమాట అతనికి జ్ఞాపకం వచ్చింది.

"సింథియా! బట్టలు వేసేసుకో"-అనాలనుకున్నాడు వినోద్. సింథియా వేరే విధంగా అనుకుంటుందని అత నామాట అనలేదు.

నగ్నంగా సింథియా బావుంది. కాని తనకెందుకు నిరాశ?

వినోద్ కళ్ళమీద నుంచి చెయ్యి అయితే తీసేశాడు కాని కళ్లు మాత్రం తెరవలేదు. ఆచేతిని అతను కిందకు దించకుండా అలాగే ఎత్తివుంచి-నేనిక్కడికిరాకుండావుంటే బావుండేది — అనుకున్నాడు. కాని తనొక్కతే యింట్లో వున్నానంటూ సింథియా ఫోన్ చేయకుండా వుండాల్సింది. ఆమె ఫోన్ చేసినా తను ఆమెదగ్గరకు వెళ్ళాలా, వెళ్ళకూడదు అనే నిర్ణయాన్ని మటుకు తనకే వదిలివేసింది...అయినా తామిద్దరూ యిటువంటి అవకాశం కోసం ఎప్పట్నుంచో చూస్తున్నారు.

చేయి చాచి సింథియా లైట్ ఆన్ చేసింది. వినోద్ గట్టిగా కళ్ళుమూసుకున్నాడు,నిశ్శబ్దంగా వున్నాడు.

"మనం యింక బట్టలేసుకోడం మంచిదేమో." ఇంటికప్పుతో అంది సింథియా.

ఆమె మాట చప్పగా వుంది.

దీపం వెలుగుకి ఆమె కళ్ళుమూసుకోలేదు. ఇంకా అట్లాగే ఇంటి కప్పుకేసి చూస్తోంది.

సింథియా వినోద్ పట్టునుంచి తప్పుకుని తక్కున లేచి కూచుంది.

లైట్ ఆర్పేయ్, నవ్వకు - గట్టిగా అరవాలనుకున్నాడు వినోద్.

"పక్కమీద చాలా అందంగ్గా వున్నావు నువ్వు" అంది సింథియా.

ఆసందర్భమూ, అనవసరమూ అయిన ఆ పొగడ్తకి అతనికి కోపం వచ్చింది. సింతియా వుద్దేశ్యమేమిటి - అనుకున్నాడు వినోద్.

అతని బొడ్డు క్రింద వున్న పెద్ద మచ్చని వేలితోరాస్తూ, "ఏమైతే పడింది మచ్చ?" అంది సింతియా.

వినోద్ జవాబు చెప్పలేదు. సింతియా మళ్ళా ఆ ప్రశ్నా అడగలేదు.

"నీకు చక్కిలి గింతలు లేవా?"

వినోద్ తలూపాడు.

సింతియా నవ్వింది.

అతను కళ్ళు తెరచాడు. సింతియా వెలుగు చక్రంలో కూచునివుంది.

అతను పక్కకు తిరిగాడు. సింతియా ఎప్పుడు లేచి వెళ్తుందా అని చూస్తున్నాడు.

... ... ...

"మరి నేను స్నానం చేయడానికెళ్తున్నా వినోద్. నువ్వు లేచి బట్టలవీ వేసుకో. ఇప్పటికే చాలా ఆలస్యమైంది...నాకు భయమేస్తోంది బాబు వారు..."

పక్కమీద నుంచి లేచి వెళ్ళేముందు, సింతియా వినోద్ వీపుని మెల్లగా తట్టింది. గట్టి చరువేదో తిన్నట్టుగా అతను ఉలిక్కిపడ్డాడు.

స్నానాల గదిలో షవర్ మోత అతనికి వినిపిస్తోంది.

ఏదో దెయ్యపు బరువునుంచి అప్పుడే స్వేచ్ఛని పొందినట్టనిపించింది అతనికి.

లేచివెళ్ళి స్విచ్ ఆఫ్ చేశాడు.

గదిలో చీకటి.

అతను బట్టలందుకున్నాడు. వాటిని గట్టిగా గడ్డానికి అదుముకుని అట్లాగే బయటకు పరుగెత్తబోతున్నాడు.

కాని అతను బట్టల్ని మళ్ళా పక్కమీదకి విసిరేసి, సిగరెట్ కోసం అటూ యిటూ చూశాడు.

స్నానాల గది తలుపు తెరచివుంది. దాన్ని బయటినుంచి దాదాపు బిగించేశాడు.

"వినోద్! నా బాత్‌రోబ్ యివ్వవూ... వద్దులే...నేనేవచ్చి తీసుకుంటా."

అతను మళ్లా తన బట్టలకోసం మంచం దగ్గరకు పరుగెత్తాడు.

"చీకటిలో తడుముకోవడం ఎందుగ్గానీ పక్కనట్లా వదిలేయ్ వినోద్. నేను సర్దుకుంటానులే...నువు గబగబా బట్టలేసుకో... నాకు భయమేస్తోంది ..."

సింతియా బాత్‌రోబ్ వినోద్ చేతిలో వుంది.

సింతియా స్విచ్ ఆన్ చేయబోతుండగా, "సింతియా!" అని అరిచాడు వినోద్.

ఆమె లైట్ ఆన్ చేయలేదు. స్నానాల గదిలోనుంచి కొంత వెలుగు నేలమీద పడుతోంది.

కొంతసేపటిదాకా వాళ్ళిద్దరూ బట్టలు వేసుకుంటూనే వున్నారు.

"సిగరెట్లెక్కడ?"

"డ్రెస్సింగ్ టేబుల్ మీదున్నాయి."

"లైటర్?"

"నీ దిండు కింద."

'తన' దిండు ఎక్కడవుందో తెలుసుకోవడానికి కొంచెం సేపు పట్టింది వినోద్‌కి.

"లైట్ వేస్తే యేం పోయింది?" సింతియా కాస్త గట్టిగా అడిగింది.

"కింద నీ కోసం చూస్తుంటా నేను."

"కావాలనుకుంటే నువు డ్రింక్ తీసుకో."

"వద్దులే. ఇద్దరం బయటెక్కడైనా తాగొచ్చు."

దాదాపు మెట్ల దగ్గరకి వచ్చేశాడు వినోద్.

సింతియా లైట్ ఆన్ చేసింది.

"నీ వస్తువులేవీ యిక్కడ వదల్లేదుగదూ!" అంది సింతియా.

మళ్ళా పరుపు దగ్గరకి గుంజుకుపోతున్నట్టుగా అనిపించింది వినోద్‌కి.

తల దువ్వుకుంటూ అద్దం ముందు నిలబడి వుంది సింతియా.

పక్కమీద చిందర వందరగా పడివున్న చిల్లర డబ్బుల్ని చూశాడతను వాటిని తీసుకోవడానికి వంగినప్పుడు పరుపు క్రింద మాసి

పోయి వున్న చిన్న బంతి కనిపించింది. ఆ బంతినే చూస్తూ చిల్లరని తీసుకున్నాడు.

"ఆ ఎన్వెలప్ ఏదేనా?" సింతియా అడిగింది.

ఎన్వెలప్ అందుకుని "కాదు" అన్నాడు వినోద్.

"అయితే దాన్ని ఎక్కడుందో అక్కడే పెట్టేయ్".

పెట్టేశాడు.

పక్క సర్దాలనుకున్నాడు కానీ సింతియా వద్దన్న మాట జ్ఞాపకం వచ్చింది.

దిండుకి అంటుకుని వున్న పొడుగాటి తల వెంట్రుకని చూసి, దాన్ని తీశాడు.

"యాష్ట్రేని కిందికి తీసుకువెళ్ళు... దానిలో నువ్వుకాల్చిన సిగరెట్ పీక లున్నాయ్"

తలవెంట్రుకని జేబులో పెట్టేసుకుని, యాష్ట్రేని తీసుకున్నాడు వినోద్.

"మనం యింతకీ ఎక్కడికి వెళ్తున్నాం?"

"నీ యిష్టం. ఎక్కడికి వెళ్దామంటే అక్కడికి"

అతను మళ్ళా మేడమెట్ల దగ్గరికి వచ్చేశాడు.

'నా 'డ్రై' నీకు అక్కడెక్కడైనా కనిపిస్తే..."

"నాకు భయమేస్తోంది బాబూ?" అంది సింతియా.

భయం ధ్వనించిన సూచనేమీ ఆమె మాటలో వున్నట్టు అనిపించలేదు వినోద్‌కి.

సింతియా అట్లాగే అద్దంముందు బట్టలు లేకుండా - సబ్బు, పౌడర్ల సువాసనల అచ్ఛాదనతో - నిలబడివుంది.

"నువు త్వరగా తెములు."

"ఏ చీర కట్టుకోను? నువ్విచ్చిన చీర కట్టుకోనా?"

"నీకేమైనా పిచ్చా?"

సింతియా నవ్వింది. ఆ నవ్వులో పిచ్చిలేదు.

... ... ...

వినోద్ మెట్లు దిగి కిందికి పరుగెత్తాడు. కింది గదిలో-లివింగ్‌రూంలో-అంత చీకటిగా లేదు. కర్టెన్లను పక్కకి తొలగించి లైట్ ఆన్ చేశాడు అతను.

టేబుల్‌మీద రెండు గ్లాసులున్నాయి.

వాటిని తీసుకుని కిచెన్‌లోకి వెళ్ళాడు వినోద్. అక్కడ 'సింక్' నిండా కడగని పళ్ళాలూ అవీ వున్నాయి.

అతను మళ్ళా లివింగ్ రూంలోకి వచ్చాడు.

యాష్ట్రేలో వున్న తను కాల్చిన సిగరెట్లని తీసి జేబులో వేసుకున్నాడు చేయి పొగాకు కంపు కొడుతున్నా అతనికి మళ్ళా కిచెన్‌లోకి వెళ్ళా లనిపించలేదు

జేబురుమాలకోసం ఆ జేబూ యీ జేబూ- ఒక దాని తర్వాత యింకోదాన్ని - వెతికాడు. జేబురుమాల్ని పైన విడిచేసి వుంటాను - అనుకున్నాడు. సింతియాని పిలవాలనుకున్నాడు కాని ఆమే జేబురుమాల్ని చూస్తే తీసుకొస్తుందని వూరుకున్నాడు.

అవునూ! సింతియా పైనేం చేస్తోంది? అక్కడినుంచి చెప్పాపెట్టకుండా మెల్లగా జారుకోవాలనిపించింది అతనికి.

ఒకసారెప్పుడో తనొచ్చినప్పుడు, "నువు రాకుండా వుండాల్సింది." అంది సింతియా.

తను నవ్వి, "అయితే వెళ్ళిపోతా." అన్నాడు. తర్వాత, సింతియా ఒక క్షణం మాట్లాడకుండా వూరుకుని ధబాలున తలుపు వేసింది. అట్లా కొంచంసేపు యిద్దరూ తలుపు దగ్గరే నిలబడ్డారు

"సరే! ఏ కారణం చేతైనా వారు మామూలుకంటే ముందే యింటికొచ్చేస్తే?"

"అట్లా అనుకునే దానివి నాకు ఫోన్ చేయకుండా వుండాల్సింది" అన్నాడు తను.

"అసలు నువు రాకుండా వుండాల్సింది. అవును. నీకు ఫోన్ చేయడం నా పొరపాటే."

"అయితే రావడం నాదీ పొరపాటే."

నిజానికి ఆ మాటకి యిద్దరూ నవ్వి వుండాల్సింది. నవ్వలేదు

తలుపు దగ్గర నిలబడి వుండగానే సింతియాని ముద్దు పెట్టుకోబోయాడు తను.

"వొద్దు వినోద్, ఇక్కడొద్దు బయటి కెక్కడికైనాపోదాం.ఇక్కడమాత్రం వొద్దు."

"ఈ నాన్సెన్స్‌తో ఏమిటీ కాలయాపన ?"

"అయినా యిక్కడొద్దు - నా మాట విను."

సరిగ్గా అప్పుడే తను లివింగ్ రూం మూల పెద్ద లైఫ్ సైజ్ బొమ్మ నొకదాన్ని చూశాడు విపరీతంగా భయం వేసింది.

తనా క్షణంలో వెనక్కితిరిగి వెళ్ళి పోయుంటేనో... !

... ... ...

మళ్ళా యిప్పుడూ వినోద్ ఆ బొమ్మనే చూశాడు. అది పెద్ద బొమ్మ. అతను దాని దగ్గరకు వెళ్ళాడు. దాన్ని తీసుకున్నాడు. చూశాడు. దాన్ని మళ్ళా వున్నచోటే పెట్టేయ బోతుంటే-అతని చెయ్యి బొమ్మ వెనక దేనికో తగిలింది అట్లా అనుకోకుండానే అతని చెయ్యి ఆ బొమ్మకి "కీ" యివ్వటం జరిగింది, దాంతో ఆ బొమ్మ మాట్లాడడం మొదలెట్టింది.

ప్లీజ్ టేకివర్ సీట్ హౌడూ యూఫీల్‌దిస్ మార్నింగ్.

వినోద్ బొమ్మని జారవిడిచేసి కుర్చీలో చతికిల పడ్డాడు

బొమ్మ పెదాలు యింకా అట్లాగే కదులుతున్నాయి - మాటామంతీ లేకుండా.

సింథియా మెట్లుదిగి వస్తుండడం వినిపించింది అతనికి. దిండొకటి అందుకుని ఆ బొమ్మ మీదకు విసిరికొట్టాడు.

"థాంక్యూ" అంది బొమ్మ.

"ఏమిటది వినోద్ ? ఏం పనది ?"

సింథియా బొమ్మనితీసుకుని మాట్లాడకుండా చూస్తోంది.

"ఎందుకు చేశావిట్లా ?"

"ఉత్తినే చూస్తున్నా. చేతుల్లోంచి జారి కిందపడిపోయింది." తప్పుచేసిన కుర్రాడి మాటలావుంది అతని మాట.

"నువు దిండుని బొమ్మమీదకు విసరడం నేను చూశా."

వినోద్ ఏం మాట్లాడలేదు.

"బతికించావు ... బొమ్మనింకా విరగ్గొట్టలేదు నువ్వు ... అది కనక విరిగివుంటే మా అమ్మాయి..."

బొమ్మ అంతకుముందు ఎక్కడుందో అక్కడ దాన్ని కూచోబెట్టింది సింథియా.

"థాంక్యూ" అంది బొమ్మ.

సింథియాతో పాటుఅతనునవ్వలేకపోయాడు.

సింథియా లేతగులాబీరంగు బట్టలు వేసుకుంది. ఆమె భుజాలమీద బరువుగావున్న కోటు. ఆమెని చూస్తే, అంతకుముందే ఆమె పక్కమీదనుంచి లేచివచ్చిందని ఎవరూ అనుకోరు.

వినోద్ కళ్ళు మూసుకుని సింథియా తన పక్కన నగ్నంగా పడుకుని వుండడాన్ని వూహించుకు చూశాడు.

కొంచెంసేపు యిద్దరూ అక్కడే ఏం మాట్లాడకుండా అట్లా నిలబడ్డారు.

"వినోద్ ! నాదొకమాట...నువ్వేం అనుకోవు గదూ !"

సింథియా ఏం చెప్పబోతుందో గ్రహించాడు వినోద్.

"ఎంత పొద్దుపోయిందో చూస్తున్నావు గదా...నే నిప్పుడు బయటికి రావడం మంచిది కాదేమో..."

"అయితే సరే." ఆ మాట అంటూ వినోద్ ఆమెవైపు చూడలేదు.

అతను అటూ యిటూ వూగుతూ తలుపు వైపు నడిచాడు. అతని వెనకనే నడిచింది సింథియా కూడా.

అతను తలుపు తీశాడు. వెనక్కి ఒకసారి తిరిగి చూసి బయటికి వచ్చేశాడు.

బయట చలిగా వుంది.

జేబులోని సిగరెట్ పీకలతోను, తల వెంట్రుకలతోనూ, చైతోనూ వినోద్ వేళ్ళు ఆడుకుంటున్నాయి.

"రేపేదో ఒక టైంకి నీకు ఫోన్ చేస్తా." అంది సింథియా.

అతను అడుగులు వడిగా వేస్తూ, ఆమె ఫోన్ చేస్తుందనే నమ్మకం లేదనుకున్నాడు.

తన వెనక దభాలున మూసుకున్న తలుపు మోత అతనికి అప్పుడు వినిపించలేదు.

★